


## చైనా బీఆర్ఐ ప్రమాదకరం

గ్లోబల్ సౌత్ సదస్సులో మోదీ


# జర్నలిస్ట్ వార్త

RNI NO:Title-Code:-TELTEL02102

అనుక్షణం ప్రజల పక్షం... తెలుగు దిన పత్రిక



WANTED రిపోర్టర్లు కావలెను

జర్నలిస్ట్ వార్త దిన పత్రికలో పని చేయుటకు తెలంగాణ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలోని అన్ని జిల్లా,మండల,కేంద్రాలకు రిపోర్టర్లు కావలెను

జర్నలిస్ట్ వార్త JV NEWS

ఎడిటర్: బిర్రు కరుణాకర్ Cell:9701249103



సంపుటి - 1 సంచిక - 220 ఆదివారం18 ఆగస్టు 2024 ఎడిటర్ : బిర్రు కరుణాకర్ పేజిలు -5 వెల - 5/-

Published From Warangal : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts


# జర్నలిస్ట్ వార్త కథనానికి స్పందన

- మున్సిపల్ అధికారులను ఆదేశించిన ఎమ్మెల్యే - తక్షణమే ప్రారంభించిన పరిశుభ్రత పనులు
- అపరిశుభ్రత దర్శనమిస్తే చర్యలు తప్పవు - వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు

**వర్ధన్నపేట, ఆగస్టు 17,(జర్నలిస్ట్ వార్త):**

వర్ధన్నపేట ప్రభుత్వ ఆసుపత్రి అపరిశుభ్రతకు నిలయం అనే శీర్షికపై జర్నలిస్ట్ వార్త దినపత్రికలో ప్రత్యేక కథనం ప్రచురితమైంది. శనివారం ఇట్టి విషయమై వర్ధన్నపేట స్థానిక ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు మున్సిపల్ అధికారులను ఆదేశించారు. సీజనల్ వ్యాధుల సందర్భంగా ప్రజలు ఆసుపత్రిని ఆశ్రయిస్తూ ఉంటారు. అలాంటి ఆసుపత్రి పరిసరాలు అపరిశుభ్రంగా దర్శనమిస్తున్నాయని జర్నలిస్ట్ వార్త దినపత్రికలో వచ్చిన కథనానికి వారిని ఆదేశించడం జరిగింది. దీంతో మున్సిపల్ అధికారులు తక్షణ చర్యలు చేపట్టి హుటాహుటిన ఆసుపత్రి పరిసరాల్లో పారిశుద్ధ పనులు ప్రారంభించారు. మరోసారి అపరిశుభ్రత దర్శనమిస్తుందని ఆసుపత్రి పరిసరాలపై వార్తా కథనాలు ప్రచురితం కాకుండా జాగ్రత్త చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఆస్పత్రి పరిసరాలు ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచన చేశారు. మరోసారి ఇలాంటి వార్తలు ప్రచారంలోకి వస్తే మున్సిపల్ నిర్వాహకులపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించినట్లు సమాచారం. ప్రజలకు సౌకర్యాల కల్పన పై అనునిత్యం ఖచ్చితమైన వార్త కథనాలు ప్రచురితం చేస్తూ, ఖచ్చితమైన జర్నలిజన్ని చూపిస్తున్న జర్నలిస్ట్ వార్త దినపత్రిక యాజమాన్యానికి, విలేకరులకు, తక్షణమే స్పందించి పరిశుభ్రత పనులపై ఆదేశించిన వర్ధన్నపేట ఎమ్మెల్యే కె.ఆర్ నాగరాజు కి బాధిత వర్గాలు, స్థానిక ప్రజలు కృతజ్ఞతలు తెలుపుతున్నారు. ఇలాగే ప్రజా పరిరక్షణ కోసం ఒరిజినల్ జర్నలిజం ఉపయోగిస్తూ, ప్రజా సంక్షేమం కోసం పాటుపడే విధంగా వార్త కథనాలు ప్రచురితం చేస్తూ, ప్రజల ఆధార అభిమానాలు పొందుతూ కొనసాగాలని ఆకాంక్షిస్తున్నారు.




# రేవంత్ బీజేపీలో చేరడం ఖాయం!





త్వరలోనే కమలం గూటికి

40% మందికి కూడా రుణమాఫీ కాలేదు

వివరాలు సేకరించి ఉద్యమం చేపడతాం

మీడియాతో ఇష్టాగోష్ఠిలో కేటీఆర్

# ఫ్యూచర్‌సిటీకి రూట్ మ్యాప్



- ఫ్యూచర్ సిటీ అభివృద్ధిపై సిఎం సమీక్ష
- కొత్త హైకోర్టు నుంచి మెట్రో మార్గాల అన్వేషణ



హైదరాబాద్, ఆగస్టు 17,(జర్నలిస్ట్ వార్త):

ఫ్యూచర్ సిటీ అభివృద్ధి ప్రణాళికలపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమీక్ష నిర్వహించారు. శంషాబాద్ ఎయిర్‌పోర్టు నుంచి రీజినల్ రింగ్‌రోడ్డు వరకు కనెక్టివిటీ రూట్ మ్యాప్‌ను అధికారులు సీఎంకు వివరించారు. అవుటర్ రింగ్‌రోడ్డు నుంచి రీజినల్ రింగ్‌రోడ్డు వరకు కనెక్టివిటీ ఉండేలా రోడ్ మ్యాప్ తయారు చేయాలని సీఎం సూచించారు. ఫ్యూచర్ సిటీలో రేడియల్ రోడ్స్ అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. కొత్త హైకోర్టు నుంచి శంషాబాద్ ఎయిర్‌పోర్టు మీదుగా ఫ్యూచర్ సిటీకి మెట్రో మార్గం ప్రణాళికలు చేయాలన్నారు. రోడ్, మెట్రో మార్గాలకు భూసేకరణ ఇతర అంశాలపై అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. త్వరగా పూర్తి స్థాయి ప్రణాళికలు, రూట్ మ్యాప్ సిద్ధం చేసి యుద్ధప్రాతిపదికన పనులు చేపట్టాలన్నారు. తెలంగాణలో క్రీడా విశ్వవిద్యాలయం ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. హకీంపేట లేదా గచ్చిబౌలిలో యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీకి ప్రతిపాదించారు. స్పోర్ట్స్ మెడిసిన్, స్పోర్ట్స్ సైన్స్ సహా సుమారు డజనుపైగా కోర్సులు ప్రవేశపెట్టాలని ప్రభుత్వం భావిస్తోంది. ఇటీవల సియోల్‌లో కొరియన్ నేషనల్ స్పోర్ట్స్ యూనివర్సిటీని సీఎం రేవంత్ రెడ్డి సందర్శించారు. రాష్ట్రంలో స్పోర్ట్స్ యూనివర్సిటీలో భాగస్వామ్యానికి కేఎన్ఎస్‌యూ ప్రాథమికంగా అంగీకరించిందని ఈ సందర్భంగా సీఎం తెలిపారు.

# ఫ్లెక్సీల వార్




సిద్దిపేటలో బీఆర్ఎస్ వర్సెస్ కాంగ్రెస్

హరీశ్ రాజీనామా చేయాలంటూ ఫ్లెక్సీలు

వాటిని చింపివేసిన బీఆర్ఎస్ శ్రేణులు

క్యాంపు కార్యాలయంలో కేసీఆర్, హరీశ్ ఫ్లెక్సీలను చింపివేసిన కాంగ్రెస్ శ్రేణులు

ఇరువర్గాల ఆందోళనతో ఉద్రిక్తత

# రైతులు ఆందోళన చెందొద్దు..

## అందిరికీ మాఫీ చేస్తాం: తుమ్మల

- మాఫీకి రూ.17933కోట్లు విడుదల
- 22.37లక్షల రైతుల ఖాతాలకు నిధుల జమ
- త్వరలో రూ.2లక్షలపైన రుణాలు మాఫీ
- సాంకేతిక సమస్యలను పరిష్కరిస్తున్నాం
- రుణమాఫీ కాని వారి వివరాలు తెలపండి
- రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు: మంత్రి తుమ్మల స్పష్టత



హైదరాబాద్: ఆగస్టు 17,(జర్నలిస్ట్ వార్త): రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న రూ.2 లక్షల లోపు రైతు రుణాలన్నింటిని మాఫీ చేయడం జరిగిందని, ఇప్పటివరకు 22,37,848 మంది రైతేల బ్యాంకు ఖాతాలకు రూ.17933.19 కోట్ల నిధులు విడుదల చేసినట్టు వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడించారు. ఏదేని కారణాల వల్ల 2 లక్షలలోపు ఉన్న రుణం మాఫీ కానీ ఖాతాదారుల వివరాలు సేకరించి, పోర్టల్ లో అప్ లోడ్ చేసేందుకు వ్యవసాయాధికారులకు ఆదేశాలు జారీ చేసినట్టు తెలిపారు. మిగతాది 2లో...




## ప్రభుత్వ భూముల సంరక్షణ కోసం రిమోట్ రెఫరెన్సింగ్ విధానం

# ప్రభుత్వ భూముల సంరక్షణ కోసం రిమోట్ రెఫరెన్సింగ్ విధానం

**పైలట్ ప్రాజెక్టుగా పోలీసు శాఖ, ఆర్టీసీ భూముల సంరక్షణకు చర్యలు**

**దశల వారీగా ఎండోమెంట్స్, వక్ఫ్ భూములు సహా ఇతర శాఖల భూముల సంరక్షణ కోసం చర్యలు**

**రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జీ చిన్నారెడ్డి వెల్లడి**



హైదరాబాద్, ఆగస్టు 17,(జర్నలిస్ట్ వార్త): రాష్ట్ర ప్రభుత్వానికి సంబంధించిన వివిధ శాఖల భూములు, ఇతర స్థిరాస్తులను జియో రెఫరెన్సింగ్ మ్యాపింగ్ ద్వారా సంరక్షించనున్నట్లు రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జి చిన్నారెడ్డి వెల్లడించారు. శనివారం ఖైరతాబాద్‌లోని తెలంగాణ రిమోట్ ఏజెన్సీ సెంటర్ (టీజీ రాక్) సంస్థ కార్యక్రమాలను ఉన్నతాధికారులతో సమీక్షించారు.

ఈ సందర్భంగా చిన్నారెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ శాఖల భూములు, ఇతర స్థిరాస్తులు నిరంతరంగా దురాక్రమనకు గురవుతున్నాయని, ఈ అంశాలను దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వ భూముల సంరక్షణ ఏకైక లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం కార్యాచరణ ప్రణాళికను రూపొందిస్తున్నట్లు తెలిపారు. అందులో భాగంగా పైలట్ ప్రాజెక్టుగా పోలీసు శాఖ, రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (ఆర్టీసీ) భూములు, ఇతర స్థిరాస్తుల సంరక్షణ కోసం జియో రిఫరెన్సింగ్ మ్యాపింగ్ పద్ధతిని అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. రానున్న రోజుల్లో ఎండోమెంట్స్, వక్ఫ్ భూములు, ఇతర శాఖల భూముల సంరక్షణ కోసం ఇదే విధానాన్ని కొనసాగిస్తామని తెలిపారు.ప్రభుత్వ భూముల జోలికి ఎవరూ రాలేని పరిస్థితిని తీసుకుని వచ్చేందుకే జియో రిఫరెన్సింగ్ పద్ధతిని అనుసరిస్తున్నట్లు వివరించారు. ప్రభుత్వ భూముల జోలికి ఎవరైనా వస్తే కఠిన చర్యలు తప్పవు అని హెచ్చరించారు. జిహెచ్ఎంసి పరిధిలో స్థిరాస్తుల వివరాల సేకరణ కోసం తెలంగాణ ప్రభుత్వ రిమోట్ సెన్సింగ్ సెంటర్ సేవలను వినియోగించుకోవాలని, ప్రైవేట్ సంస్థలకు ఈ బాధ్యత అప్పగించ వద్దన్న విషయాన్ని జిహెచ్ఎంసి కమిషనర్ ఆమ్రపాలికి సూచించారు. అటవీ శాఖలో మొక్కల సంరక్షణ కోసం వినియోగించే జియో టాకింగ్ బాధ్యతలను ప్రభుత్వ రిమోట్ సెన్సింగ్ సెంటర్ కు అప్పగించాలని, ఈ విషయాన్ని పిసిసిఎఫ్ డోబ్రియాల్ దృష్టికి తీసుకెళ్లనున్నట్లు ఆయన తెలిపారు. హైదరాబాద్ నగరం చుట్టూ ఉన్న 920 చెరువులలో దాదాపు 240 చెరువులు ఆక్రమణకు గురై కబ్జా దారుల చేతుల్లో మాయం అయ్యాయని, ఇలాంటి పరిస్థితులు రాకుండా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హైడ్రాను నెలకొల్పిన విషయాన్ని గుర్తు చేశారు. రాష్ట్రంలో పంటల సాగు విస్తీర్ణం ప్రతి ఏటా పెరుగుతోందని, దీనిపై పలు అనుమానాలు ఉన్నాయన్నారు. ఈ అనుమానాలను నివృత్తి చేసేందుకు క్షేత్రస్థాయిలో జియో రెఫరెన్సింగ్ విధానాన్ని ఉపయోగించి పక్కా సాగు లెక్కలు సేకరించాలని చిన్నారెడ్డి అధికారులకు సూచించారు. ఒక సంవత్సరంలో కోటి ఎకరాలకు సాగునీరు అందిస్తామని చెప్పడం, మరుసటి సంవత్సరం కోటి యాభై లక్షలు ఎకరాలకు సాగునీరు అందిస్తామని చెప్పడం వంటి విషయాలను గమనిస్తే ఈ అనుమానాలు కలుగుతున్నాయన్నారు.

ఇలాంటి అనుభవాలను దృష్టిలో ఉంచుకొని రానున్న రోజుల్లో రైతుల నుంచే తనకున్న భూమిలో ఏయే పంటలు యంత విస్తీర్ణంలో సాగు చేస్తున్నారు అని స్వీయ నివేదికను తీసుకోవాలన్న ఆలోచనను అమలు చేయనున్నట్లు తెలిపారు. నిజాయితీకి మారు పేరు రైతులు అని, రైతులు చెప్పే పంట సాగు వివరాలు పక్కాగా ఉంటాయని అభిప్రాయపడ్డారు. తెలంగాణ రాష్ట్ర రిమోట్ సెన్సింగ్ సెంటర్ అధికారులు, ఉద్యోగుల పని తీరును అభినందించారు. ఈ సమీక్షా సమావేశంలో రిమోట్ సెన్సింగ్ అదనపు డైరెక్టర్ జనరల్ మనోహర్, అర్థ గణాంక శాఖ డైరెక్టర్ రుఫస్ దత్తం, పరిపాలన అధికారి రాజోజు నరసింహా చారీ, జేడి శివ ప్రసాద్, సైంటిస్టులు, తదితరులు పాల్గొన్నారు.

# ఫ్లెక్సీల వార్




**సిద్దిపేట** ఆగస్టు 17,(జర్నలిస్ట్ వార్త): రుణమాఫీ అంశం.. కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య ఘర్షణకు దారి తీసింది. సిద్దిపేట జిల్లా కేంద్రంలో శుక్రవారం రాత్రి నుంచి శనివారం మధ్యాహ్నం వరకు ఫ్లెక్సీల వార్ నడిచింది. దీంతో పట్టణంలో హైడ్రామా నెలకొంది. రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ అమలు చేసి చూపామని, హరీశ్‌రావు రాజీనామా ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలని శుక్రవారం అర్ధరాత్రి పట్టణంలోని పలు ప్రాంతాల్లో కాంగ్రెస్ నాయకులు ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. దీంతో బీఆర్ఎస్ నేతలు బీజేఆర్ చౌరస్తాకు వచ్చి ఆ ఫ్లెక్సీలను వెంటనే తొలగించాలని డిమాండ్ చేస్తూ ఆందోళనకు దిగారు. మరోపక్క కాంగ్రెస్ నేతలు హరీశ్‌రావు క్యాంపు కార్యాలయంలోనికి చొచ్చుకుని వెళ్లి కేసీఆర్, హరీశ్ ఫ్లెక్సీలను చింపివేశారు. విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ నాయకులు, విద్యార్థి.. యువజన విభాగం నాయకులు, హరీశ్ అభిమానులు శనివారం ఉదయం క్యాంపు కార్యాలయానికి భారీగా చేరుకున్నారు. అక్కడి నుంచి అంబేద్కర్ చౌరస్తా వరకు ర్యాలీగా వెళ్లి రాస్తారోకో చేశారు. ఈ క్రమంలోనే కాంగ్రెస్ కార్యకర్తలు బీజేఆర్ చౌరస్తాకు చేరుకుని.. ఎమ్మెల్యే హరీశ్ క్యాంపు కార్యాలయంలో సీఎం రేవంత్‌రెడ్డి ఫ్లెక్సీ ఏర్పాటు చేస్తామంటూ కార్యాలయం వైపు వెళ్తుండగా పోలీసులు అడ్డుకుని, వారిని అరెస్టు చేశారు.

కాంగ్రెస్ నాయకులు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీని బీఆర్ఎస్ నాయకులు చింపివేయగా, పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నారు. ఈ క్రమంలో పోలీసులకు, బీఆర్ఎస్ నాయకులకు మధ్య తోపులాట జరిగింది. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో పోలీసులు స్వల్ప లాఠీచార్జి చేసి బీఆర్ఎస్ నాయకులను చెదరగొట్టారు. ఆయా ఘటనలపై ఇరువర్గాలు పరస్పరం పోలీసులకు ఫిర్యాదులు చేశాయి. దీంతో రెండు వర్గాలపై కేసులు నమోదు చేసినట్లు ఏసీపీ మధు తెలిపారు. మరోవైపు.. ఎమ్మెల్యే హరీశ్‌రావు శనివారం సాయంత్రం సిద్దిపేటకు వచ్చారు. ఈ సందర్భంగా పార్టీ కార్యకర్తలు వచ్చారు. వారిని ఉద్దేశించి హరీశ్ మాట్లాడుతూ.. 'మీరు చూపిస్తున్న ప్రేమాభినాలు ఎనలేనివని, ఏమిచ్చినా మీ రుణం తీర్చుకోలేనని' అన్నారు. తానెప్పుడూ దాడులను ప్రోత్సహించలేదని, పదేళ్లు మంత్రిగా ప్రజలకు సేవ చేశానని చెప్పారు.

హరీశ్‌రావు ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలంటూ మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు అభిమానులు శుక్రవారం హైదరాబాద్‌లోని వివిధ ప్రాంతాల్లో ఫ్లెక్సీలు, హోర్డింగ్‌లను ఏర్పాటు చేశారు. దీనికి కౌంటర్‌గా శనివారం బీఆర్ఎస్ అభిమానుల పేరుతో నగరంలోని వివిధ ప్రాంతాల్లో బస్టాపల వద్ద బ్యానర్లు కట్టారు. రుణమాఫీ మాట తప్పి మోసం.. రైతాంగం పాలిట కాంగ్రెస్ శాపం.. అంటూ బ్యానర్లు వెలిశాయి. కాగా, హరీశ్ క్యాంపు కార్యాలయంపై దాడి హేయమైన చర్య అని, ఇది కాంగ్రెస్ గూండాలు చేసిన పని అని ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి ఆరోపించారు.

# రేవంత్ బీజేపీలో చేరడం ఖాయం!

హైదరాబాద్, ఆగస్టు 17,(జర్నలిస్ట్ వార్త): సీఎం రేవంత్‌రెడ్డి త్వరలోనే తన బృందంతో కలిసి బీజేపీలో చేరతారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కేటీఆర్ అన్నారు.

రేవంత్ తదుపరి రాజకీయ మజిలీ బీజేపీతోనేనని చెప్పారు. ముఖ్యమంత్రే పార్టీ మారి.. కొత్త చరిత్రకు నాంది పలుకుతారేమోనన్నారు. తాను పుట్టింది బీజేపీలోనే.. చివరి రాజకీయ ప్రస్థానం కూడా బీజేపీతోనే ముగుస్తుందంటూ ప్రధాని మోదీతో, అమిత్‌షాతో రేవంత్ చెప్పారని తెలిపారు. కాషాయ జెండాతోనే ఏబీవీపీలో రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించానని, అదే జెండా కప్పుకొని చనిపోతానని మోదీతో చెప్పినమాట వాస్తవమో, కాదో రేవంత్ స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు.శనివారం తెలంగాణ భవన్‌లో మీడియాతో కేటీఆర్ ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. రైతులకు రూ.2 లక్షల వరకు రుణమాఫీ చేశామని ప్రభుత్వం చెబుతోందని, కానీ.. 40% మంది రైతులకు కూడా మాఫీ కాలేదన్నారు. సోమ లేదా మంగళవారం నుంచి రుణ మాఫీ పొందని వారి వివరాలు సేకరిస్తామని, అనంతరం కలెక్టర్ నుంచి రాష్ట్రస్థాయిలో మంత్రులు, సీఎం వరకు వినతులు అందజేస్తామని చెప్పా రు. అప్పటికీ మాఫీ చేయకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన చేపడతామని, అవసరమైతే రైతాంగ ఉద్యమానికి శ్రీకారం చుడతామని ప్రకటించారు.

సిద్దిపేటలో హరీశ్‌రావు క్యాంపు కార్యాలయంపై దాడి ఘటనపై కేటీఆర్ స్పందిస్తూ.. ప్రభుత్వంలో ఉన్నవారే ప్రభుత్వ ఆస్తులపై దాడులు చేయించడం దేనికి సంకేతమని ప్రశ్నించారు. ఈ దాడికి పాల్పడిన వారిపై ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం బాధాకరమన్నారు. ముఖ్యమంత్రికి చెందిన ఓ మీడి యా సంస్థ ఆలిండియా సర్వీసలో ఉన్న అధికారుల వద్దకు వెళ్లి.. వారిపై దాడి చేసేలా వ్యవహరిస్తోందని, ఇది ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు.

కాగా, తమ ప్రభుత్వ హయాంలో లక్ష ఉద్యోగాల కల్పనతో ప్లాంటు నెలకొల్పేలా ఫాక్స్‌కాన్ కంపెనీ ఒప్పందం కుదుర్చుకుందని కేటీఆర్ తెలిపారు. అయితే ఇప్పుడు ఆ కంపెనీ 40 వేల ఉద్యోగాలతో బెంగళూరులో క్యాం పస్ ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించిందన్నారు. ఫాక్స్‌కాన్ పెట్టుబడులు, విస్తరణపై నిజానిజాలను ప్రభు త్వం బయటపెట్టాలని డిమాండ్ చేశారు. కాగా, ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం చేస్తున్న మహిళల పట్ల అభ్యంతరకర వ్యాఖ్యలు చేశారంటూ రాష్ట్ర మహిళా కమిషన్ నోటీసులు జారీ చేసిన నేపథ్యంలో ఈ నెల 24న కమిషన్ ఎదుట హాజరవుతానని కేటీఆర్ చె ప్పారు. రాష్ట్రంలో మహిళలపై జరుగుతున్న ఘటనల వివరాలను కమిషన్‌కు అందజేస్తాని తెలిపారు.

# రైతులు ఆందోళన చెందొద్దు..

**(మొదటి పేజి తరువాయి)**

కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వంలోకి వచ్చిన మొదటి పంటకాలంలోపే 26,140.13 కోట్లు రైతు సంక్షేమానికి ఖర్చు పెట్టామని వివరించారు.గత ప్రభుత్వం పెట్టిన రైతుబంధు బకాయిలు, డ్రిప్ ఇరిగేషన్ సబ్సిడీలు ఆయిల్ పాం రైతులు, కంపెనీలకు పెట్టిన బకాయిలు, పచ్చిరొట్ట విత్తనాల సబ్సిడీ బకాయిలు కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాకే చెల్లించామన్నారు.

మాది చేతల ప్రభుత్వం, దిగజారుడు రాజకీయాలు తమకు రావన్నారు. రాష్ట్రంలోని 35 బ్యాంకులకు సంబంధించిన 3292 బ్రాంచులు, 909 ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల నుండి 12 డిసెంబర్ 2018 నుండి 09 డిసెంబర్ 2023 వరకు తీసుకున్న పంటరుణాల వివరాలు తెప్పించడం జరిగిందన్నారు. పాస్ బుక్ కలిగి వుండి రుణాలు పొందని ఖాతాల సంఖ్య 42 లక్షలు (ఆధార కార్డ్ నంబరు తప్పుగా నమోదైన ఖాతాలు, పంట రుణంలో అసలు కన్నా వడ్డీ ఎక్కువ వున్న ఖాతాలు తప్ప అన్నీ వివరాలు సరిగ్గా ఉన్నవి) రుణమాఫీ 2024 పథకం విధివిధానాలు, మార్గదర్శకాలతో ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మొదటి పంట కాలంలోనే ప్రభుత్వ ఉత్తర్వులు జీవో 567 ద్వారా విడుదల చేసినట్టు వివరించారు. ప్రభుత్వ ఉత్తర్వులు వెలువడిన 3 రోజులకే అనగా 2024 జులై 18నాడు, లక్షలోపు రుణాలున్న రైతుల 11,50,193 ఖాతాలకు రూ. 6098.93 కోట్లు విడుదల చేసి వారి రుణ విముక్తులను చేసినట్టు వెల్లడించారు.రెండవ విడతలో లక్ష నుండి లక్షయాభై వేల వరకు రుణాలు ఉన్న 6,40,823 మంది రైతుల ఖాతాలకు రూ.6190.01 కోట్లు విడుదల చేసి, వారిని రుణ విముక్తులను చేసామన్నారు.మూడవ విడుతలో 2024ఆగస్టు 15 నాడు, ప్రభుత్వం ఇచ్చిన హామీలకు 2 లక్షలలోపు రుణాలు 4,46,832 మంది రైతుల ఖాతాలలో రూ.5644.24 కోట్ల నిధులు విడుదల చేసి వారిని విముక్తులను చేశామన్నారు.మూడు విడతలలో మొత్తం 22,37,848 మింది రైతుల ఖాతాలకు రూ. 17933.19 కోట్ల నిధులు విడుదల చేసి ఆగస్టు 15 లోగా 2 లక్షల వరకు రుణం ఉన్న రైతులందరిని రుణ విముక్తులను చేసినట్టు వెల్లడించారు. రుణమాఫీ 2024 కు సంబంధించి రేషన్ కార్డు ప్రామాణికం కాదు అని పదేపదే చెప్పడం జరిగిందని, . కేవలం కుటుంబ నిర్ధారణకు మాత్రమే దానిని పరిగణలోనికి తీసుకున్నామన్నారు.

రుణమాఫీ కాని వివరాలు తెలపండి:

రూ.2 లక్షలలోపు రుణాలు ఉండి, రేషన్ కార్డు లేనివారు, ఆధార్ కార్డు వివరాలు తప్పుగా నమోదైనవారు మరే ఇతర కారణముతో రుణమాఫీ వర్తించని వారు వారికి దగ్గరలో ఉండే వ్యవసాయ అధికారిని సంప్రదిస్తే కారణం తెలుస్తుందని, దానిని బట్టి తగిన రికార్డులు సమర్పిస్తే వారికి కూడా త్వరలో రుణమాఫీ వర్తింపచేస్తామని ప్రకటించారు. ఇప్పటికే వ్యవసాయాధికారులందరికీ ఆదేశాలు జారీ చేశామని, మండల పరిధిలో ఉన్న అన్ని బ్యాంకు బ్రాంచులు,పిఏసిఎస్‌లకు సంబంధించిన అన్ని సమస్యాత్మక ఖాతాలకు పూర్తి బాధ్యత ఆ మండల వ్యవసాయాధికారి తీసుకుంటారని తెలిపారు.

రైతు కుటుంబ నిర్ధారణ కోసం మండల వ్యవసాయాధికారి స్వయంగా రైతు కుటుంబాల దగ్గరికి వెళ్లి ఖాతాదారులు, వారి కుటుంబ సభ్యుల వివరాలు, ఆధార్ వివరాలు తీసుకుని పోర్టల్ లో అప్ లోడ్ చేస్తారని తెలిపారు.ఒకవేళ రుణఖాతాలో నమోదైన పేరు, ఆధార్ లో నమోదైన పేరుతో సరిపోలకపోతే ఖాతాదారుని దగ్గర సరైన వివరాలు సేకరించి పోర్టల్ లో అప్ లోడ్ చేస్తారన్నారు. ఒకవేళ బ్యాంకు సమర్పించిన అసలు, వడ్డీలలో తేడా ఉన్నట్లయితే ఖాతాదారుడు వ్యవసాయాధికారికి తెలియజేయాలని సూచించారు.

# సీఎం రేవంత్ రాజీనామా చేయాలి..

**54 శాతం మంది రైతులకు రుణమాఫీ కాలేదు తొండిలో తోపు.. బూతులు తిట్టడంలో టాప్**

**నా క్యాంపు కార్యాలయంపై దాడి చేయించారు భౌతిక దాడులూ చేస్తారని అనుమానం ఉంది: హరీశ్**

**ఎంతమందికి మాఫీ అయిందో తెలుసుకుందాం.. తేదీ, స్థలం చెప్పాలంటూ సీఎం రేవంత్‌కు సవాల్**



హైదరాబాద్,ఆగస్టు 17,(జర్నలిస్ట్ వార్త):

కాంగ్రెస్ ప్రభుత్వం గొప్పగా చెప్పుకొంటున్న రూ.2 లక్షల రుణమాఫీ.. రాష్ట్రంలో 54 శాతం మంది రైతులకు అందలేదని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. ఇందుకు సీఎం రేవంత్‌రెడ్డి.. ప్రజలను క్షమాపణ కోరడంతోపాటు ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. రూ.2 లక్షల రుణమాఫీపై శ్వేతపత్రం విడుదల చేయాలని, రాష్ట్రంలో ఎంత మంది రైతులున్నారు, వారిలో ఎంతమందికి ఎన్ని కోట్లు అందించారు, ఎన్ని నిధులు రైతుల ఖాతాల్లో జమ అయ్యాయనే విషయాలను బహిర్గతం చేయాలని అన్నారు.

ఈ మేరకు శనివారం తెలంగాణ భవన్‌లో హరీశ్‌రావు విలేకరులతో మాట్లాడారు. అధికారంలోకి రాగానే 2023 డిసెంబరు 9నాడే రుణమాఫీ అమలు చేస్తామని చెప్పి.. 2024 ఆగస్టు వరకు పొడిగించారని, అయినా 54 శాతం మంది రైతులకు రుణమాఫీ అందలేదని మండిపడ్డారు. నిజంగా రుణమాఫీ అందరికీ జరిగిందని సీఎం భావిస్తే.. నేరుగా రైతుల వద్దకే వెళ్లి తెలుసుకుందామని, తేదీ, సమయం చెప్పాలని సవాల్ చేశారు. ఏ నియోజకవర్గంలోని ఏ గ్రామమైనా పర్వాలేదని, కొడంగల్‌కైనా వెళదామని అన్నారు.రుణమాఫీ పూర్తి చేశామంటూ తనను రాజీనామా చేయాలంటున్నారని, కానీ.. ఆగస్టు 15లోపు రూ.2 లక్షల రుణమాఫీతోపాటు ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారెంటీల్లోని 13 హామీలను సంపూర్ణంగా అమలు చేస్తే రాజీనామా చేస్తానని తాను స్పష్టంగా చెప్పానని గుర్తు చేశారు. రేవంత్‌రెడ్డిలాగా తాను మాట తప్పే వ్యక్తిని కాదని, కొడంగల్‌లో ఓడిపోతే రాజకీయ సన్యాసం తీసుకుంటానని చెప్పి, పార్టీలు మారిన చరిత్ర తనది కాదని వ్యాఖ్యానించారు.రుణమాఫీపై కాంగ్రెస్ పార్టీ ఒక్కో సందర్భంలో ఒక్కో రకంగా చెప్పిందని హరీశ్‌రావు అన్నారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో రూ.40 వేల కోట్లు అన్నారని, జూన్ 21న కేబినేట్ భేటీ అనంత రంప్రెసమీట్‌లో రూ.31 వేల కోట్లు అన్నారని, బడ్జెట్‌లో రూ.26 వేల కోట్లు కేటాయించారని, చివరకు 22 లక్షల మంది రైతులకు రూ.17 వేల కోట్లే మాఫీ చేశారని విమర్శించారు. ఇది కూడా అందరికీ అందలేదన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రూ.లక్ష రుణమాఫీ ప్రక్రియలో 36 లక్షల మంది రైతులకు రూ.17 వేల కోట్ల ప్రయోజనం అందిందని తెలిపారు.మరి ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం రూ.2 లక్షల చొప్పున మాఫీ చేస్తే.. లబ్ధిదారుల సంఖ్య పెరగాల్సిందిపోయి ఎందుకు తగ్గిందో చెప్పాలన్నారు. రుణమాఫీ అందనివారి వివరాలను తమకు తెలియజేయాలంటూ తెలంగాణ భవన్‌లో కాల్ సెంటర్ ఏర్పాటుచేస్తే.. ఈ నెల 6 నుంచి ఇప్పటివరకు 1,16,441 ఫిర్యాదులు వచ్చాయన్నారు. తొండి చేయడంలో రేవంత్‌రెడ్డి తోపు అని, బూతులు తిట్టడంలో టాప్ అని హరీశ్‌రావు ఎద్దేవా చేశారు. పరిపాలనలో మాత్రం ఫెయిలయ్యారని అన్నారు. పార్లమెంటు ఎన్నికల సమయంలో ప్రచారానికి వెళ్లిన ప్రతి చోటా రుణమాఫీ చేస్తామంటూ అక్కడి దేవుళ్లపై ప్రమాణాలు చేశారని గుర్తు చేశారు. వాటిని నెరవేర్చకపోతే ఆ కీడు రాష్ట్రానికి ఎదురుకొడుతుందేమోనని తనకు భయమేస్తోందన్నారు. రాష్ట్రానికి, ప్రజలకు ఎలాంటి కీడు జరగకుండా చూడాలని సీఎంఒట్టు పెట్టిన అన్ని ఆలయాలు, మసీదులు, చర్చిలకు వెళ్లి మొక్కుకుని, పాప పరిహారం చేస్తానని ప్రకటించారు.రుణమాఫీ విషయంలో రేవంత్‌రెడ్డి రైతుల నెత్తిన కాంగ్రెస్ టోపీ పెట్టారని హరీశ్‌రావు విమర్శించారు. దానిని పక్కదారి పట్టించేందుకే సీఎం పదవి స్థాయిని దిగజార్చుతూ మాట్లాడుతున్నారని మండిపడ్డారు. ఇప్పటివరకు రైతులకు జరిగిన రుణమాఫీ కూడా తమ పోరాటం వల్లనే సాధ్యమైందన్నారు. రైతుల తరఫున పోరాడుతున్నందుకు తమపై గూండాలతో దాడులు చేయిస్తున్నారని ఆరోపించారు. సిద్దిపేటలోని తన క్యాంపు కార్యాలయంపై దాడి చేయించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నానన్నారు. ఇలా దాడులు చేయిస్తే రాష్ట్రానికి పెట్టుబడులు ఎలా వస్తాయని ప్రశ్నించారు

# అధికారుల భయం లేదు..?

**- తవ్వకాలకు తెగబడ్డారు - వ్యవసాయ భూములు తవ్వుతున్నారు**

**- చుట్టుప్రక్కల రైతులను భయపెడుతున్నారు - స్థానిక అధికారులకు బాధితుల ఫిర్యాదులు**

ఐనవోలు, ఆగస్టు 17,(జర్నలిస్ట్ వార్త): ఐనవోలు మండలం నందనం, రాంనగర్ గ్రామాల పరిధిలో తవ్వకాలకు ఇసుకాసురులు తెగబడ్డారు. అధికారుల భయం లేకుండా ఇష్టానుసారంగా తవ్వకాలు నిర్వహించడంతో పాటు రాంనగర్ ఆకేరు వాగు బ్రిడ్జి పక్కనే మట్టిని ఇసుకగా మార్చేందుకు బహిరంగంగానే వాటర్ వాష్ చేస్తున్నారు. నిషేధిత తవ్వకాలపై ఎలాంటి అనుమతులు లేకుండా యధేచ్ఛగా కొనసాగిస్తూ, అడ్డగోలుగా అక్రమ సంపాదనకు తెరలేపారు. బహిరంగంగా కొనసాగిస్తున్న నిర్వహణపై గ్రామపంచాయతీ అధికారులతో పాటు స్థానిక అధికారులు పట్టింపు చేయకపోవడంతో పలు అనుమానాలకు తావిస్తోంది. సంబంధిత పోలీస్ అధికారుల పెట్రో కార్ తో సహా అధికారులంతా అటువైపుగా వెళుతూ, వస్తూ ఉంటారు. కనీసం ఆదేశించడానికైనా ఆసక్తి చూపించకుండా, చూసి చూడనట్లు వెళ్లిపోవడంతో బాధితులు ఫిర్యాదు చేసిన ఫలితమే ఉంటుంది. కళ్ళముందే నిర్వహణ కొనసాగుతుంటే ప్రశ్నించలేని అధికారులు ఫిర్యాదు చేస్తే మాత్రం పట్టించుకునే అవకాశం ఉంటుందా..? అంటూ అనుమానిస్తున్నారు. ఇట్టి విషయమై తవ్వకాల పరిధిలోని చుట్టుప్రక్కల రైతులు ఫిర్యాదులు చేస్తే, సంబంధిత మైనింగ్ శాఖ అధికారులకు ఫిర్యాదు చేయమని స్థానిక అధికారులు బదులు చెప్పడం అధికారుల దాటవేసే ధోరణికి నిదర్శనంగా మారింది.



### వ్యవసాయానికి ఆటంకం

ఇసుక మెటల్ ఉన్న ప్రాంతాలపై కొంతమంది కన్నేసి స్థానిక నేతల సహకారం రైతుల వద్ద తక్కువ ధరలకు భూములు కొనుగోలు చేయడం, స్థానిక అధికారుల సహకారంతో తవ్వకాల నిర్వహణ కొనసాగించడం జరుగుతుంది. ఈ తవ్వకాల కారణంగా చుట్టు ప్రక్కల ఉన్న వ్యవసాయానికి ఆటంకం ఏర్పడుతుంది. తవ్వకాలతో గ్రౌండ్ లెవెల్ వాటర్ తగ్గిపోయి, వ్యవసాయ సాగుకు సాగునీరు అందక, ఒక్కరి స్వలాభం కోసం తవ్వకాలు మొదలెడితే, మిగతా వారి భూములు అతలాకుతలం కావడం జరుగుతుంది. ఇలాంటి పరిస్థితులపై రైతులు ఎవరికీ ఫిర్యాదు చేసుకున్నా.. ఫలితం లేకపోతుందని వారు తలరాతగా భావిస్తున్నారు. ఇలా మరికొంత కాలం చూసి చూడనట్లు వ్యవహరిస్తే, వ్యవసాయ భూములను చూసే అదృష్టం కోల్పోవాల్సిన ప్రమాదం ఉందని స్థానికులు భావిస్తున్నారు.

### అమాయకపు రైతులు తవ్వకాసురులకు భయపడుతున్నారు

అనుమతులు లేని తవ్వకాలను నిర్వహణ చేస్తూ లక్షల రూపాయలు ఘటిస్తున్న వారితో తలపడేందుకు చుట్టుపక్కల రైతులు భయపడాల్సిన పరిస్థితి చోటుచేసుకుంది. చేతిలో డబ్బు ఉందనే భరోసాతో వ్యవసాయం తప్ప మరి ఏమి అక్రమాలపై అవగాహన లేని రైతులు తవ్వకాసురులను ఎదిరించి మాట్లాడడానికి భయపడుతున్న పరిస్థితి దాపురించింది.

### వాల్టా చట్టాన్ని పూర్తిగా మర్చిపోయారు

వాల్టా చట్టం ప్రకారం తవ్వకాల నిర్వహణ చేస్తే, గ్రామపంచాయతీ కార్యదర్శి మొదలుకొని, ప్రతి అధికారి తవ్వకాల ప్రక్రియపై చర్యలు తీసుకునే అవకాశాన్ని కల్పిస్తూ వాల్టా చట్టం రూపొందించారు. గ్రామపంచాయతీ అధికారుల నుంచి మొదలుకొని సంబంధిత అధికారులతో పాటు ఉన్నతాధికారులకు సైతం కళ్ళముందే జరుగుతున్న అక్రమాన్ని అడ్డుకునే ప్రయత్నం చేయకపోవడం పట్ల అధికార యంత్రాంగంపై అటు రైతులు ఇటు స్థానికులు విమర్శలు చేస్తున్నారు. ఇప్పటికైనా అధికార యంత్రాంగం తవ్వకాల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించి, ఖచ్చితమైన చర్యలు చేపట్టాలని బాధిత వర్గాలు కోరుతున్నాయి.



# నర్సంపేట ఆసుపత్రి పై వ్యక్తమౌతున్న అనుమానాలు

**- తీసుకునే వేతనాల కంటే కమిషన్ లే ఎక్కువ..?**



వరంగల్, ఆగస్టు 17,(జర్నలిస్ట్ వార్త): నర్సంపేట జిల్లా ఆస్పత్రి పై రోజురోజుకు ఎడతెరిపి లేకుండా అనుమానాలు వ్యక్తమౌతున్నాయి. అందుకు నిదర్శనంగా మొన్న జరిగిన బదిలీల్లో భాగంగా బాధ్యతలు నిర్వర్తిస్తున్న అధికారులు ఇతర ప్రాంతాలకు వెళ్లారు. ఇతర ప్రాంతాల్లో పనిచేస్తున్న అధికారులు ప్రస్తుతం నర్సంపేట జిల్లా ఆస్పత్రిలో బాధ్యతలు చేపట్టారు. గతంలో విధులు నిర్వర్తించిన జిల్లా అధికారిగా వ్యవహరించిన డిసిహెచ్ఎస్, సూపరింటెండెంట్, తనదైన శైలిలో వ్యవహరించడం వల్లే సమస్యలు తలెత్తయన్న అనుమానాలు నర్సంపేట పట్టణ కేంద్రంలో చర్చగా మారాయి. నర్సంపేట జిల్లా ఆసుపత్రికి చెందిన స్వెటర్స్ తనదైన శైలిలో వైద్యులకు అనుగుణంగా ఉండే సుపరిచితులకు కిరాయిలకు ఇవ్వడం జరిగిందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. స్థానికంగా ఉన్న రెట్లకు భిన్నంగా ఇవ్వాల్సిన అద్దె భవనాలను తక్కువ ధరలకు ఇవ్వడం పట్ల పలు అనుమానాలు వ్యక్తమౌతున్నాయి. ఏజెన్సీల ద్వారా ఔట్ సోర్సింగ్ ఉద్యోగాలలో మాయాజాలం, ప్రస్తుత ఉద్యోగంలో ఉన్న వారికే మరో ఉద్యోగం ఇవ్వడం, అద్దెలు ఇవ్వడానికి సైతం వారికి దగ్గర వ్యక్తులకే అవకాశం కల్పించడం ఇలాంటి పరిస్థితులు రూపొందించడం శోచనీయం. ఇట్టి విషయమై సంబంధిత అధికారులు ప్రత్యేక దృష్టి సారించి, సమగ్ర విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని ఆరోపణలు చేస్తున్నారన్న విషయమై వార్తా కథనాలు ప్రచురితం అయ్యాయి. అయినప్పటికీ సంబంధిత అధికారుల్లో కదిలిక లేకపోవడం పట్ల మరిన్ని అనుమానాలకు దారి తీస్తోంది.

# అన్నారం షరీఫ్ దర్గాలో టెండర్లు ఎన్ని..?

**- భక్తుల వద్ద వసూలు చేసే వారు ఎందరు..? - వర్క్ బోర్డు ఇన్స్పెక్టర్ ఏం చేస్తున్నారు..?**

వరంగల్, ఆగస్టు 17,(జర్నలిస్ట్ వార్త): వరంగల్ జిల్లా పర్వతగిరి మండలం అన్నారం షరీఫ్ దర్గాలో ఎన్ని టెండర్లు వేసే అవకాశం ఉంటుంది. భక్తితో దర్గాకు వచ్చే భక్తుల వద్ద ఎంతమంది వసూలు కార్యచరణ కొనసాగిస్తున్నారన్న విషయమై చర్చ సాగుతోంది. దర్గాకు వచ్చిన దగ్గరనుంచి మొక్కులు చెల్లించుకుని తిరిగి వెళ్లే సమయానికల్లా ఎంతమంది భక్తులు కానుకలు చెల్లించాల్సిన అవసరం ఉంటుందన్న విషయంపై భక్తులు అయోమయం అవుతున్నారు. టెండర్లకు సంబంధిత కాంట్రాక్టు తీసుకున్నవారికి ఎలాంటి స్వాతంత్ర్యత ఉంటుందన్న విషయం తెలియని పరిస్థితిలో భక్తులు ఉన్నారు. దర్గాలోకి ప్రవేశించడం మొదలుకొని తిరిగి వెళ్లే సమయానికి దాదాపుగా 1500 నుంచి 2000 రూపాయల వరకు వసూలు చేస్తున్నారని పలుమార్లు భక్తులు ఆరోపణలు చేశారు. ఇట్టి విషయమై భక్తుల ఆరోపణ మేరకు అనేక వార్తా కథనాలు ప్రచురితమైన సంగతి విధితమే. అయినప్పటికీ సంబంధిత వర్క్ బోర్డు ఇన్స్పెక్టర్ భక్తుల ఆరోపణలపై స్పందించి, ఆదేశాలు ఇవ్వాల్సిన అధికారి అందుబాటులో లేకపోవడంతో ఇలాంటి నిలువు దోపిడి సందర్భాలు తలెత్తుతున్నాయన్న అనుమానాలు ప్రచారంలోకి వస్తున్నాయి. ఈ సందర్భంగా ఇన్స్పెక్టర్ అధికారిని వివరణ కోరగా ఇలాంటి విషయాలపై సంబంధిత హైదరాబాద్ సీఈవోకి నివేదిక పంపించడం జరిగిందని వారు బదులిస్తున్నారు. అయినప్పటికీ దర్గా పరిధిలో పరిస్థితులు చక్కబడకపోవడంతో వారితోపాటు నిర్వాహకులపై పలు విమర్శలు వినిపిస్తున్నాయి. సుదూర ప్రాంతాల నుంచి భక్తితో దర్గాకు వచ్చే భక్తుల వద్ద అడ్డగోలుగా వసూలు చేయడానికి మాత్రమే కాంట్రాక్టు తీసుకుంటున్నారా..? భక్తులను బాధించే ప్రయత్నంలో నిర్వాహకులున్నప్పుడు సంబంధిత అధికారులు ఏం చేస్తున్నారని పలువురు భక్తులు ప్రశ్నిస్తున్నారు. దర్గా పరిధిలో ఉప దర్గాలు ఏర్పాటు చేసుకుని, భక్తులను కానుకల పేరుతో బలవంత పెడుతున్నారని ఆరోపణలు అన్నారం షరీఫ్ దర్గా పరిధిలో వ్యక్తం అవుతున్నాయి. ఇట్టి విషయమై సంబంధిత కలెక్టర్ చొరవ తీసుకోవడం వల్ల ప్రత్యేక బృందం దర్గా పరిధిలో పర్యటించినట్లు సమాచారం. పర్యటించిన అధికారులు ఏఏ విషయాలపై ఆరా తీశారన్న సందర్భం భక్తులకు తెలియ వచ్చింది కాదు. ఇప్పటికైనా ప్రత్యేక బృందం అధికారులు దర్గా పరిధిలో నిర్వాహకుల వ్యవహారంపై ప్రత్యేక దృష్టి సారించి, భక్తులకు ఏర్పడుతున్న ఇబ్బందికర పరిస్థితులపై చర్యలు చేపట్టాలని భక్తుల కోరుతున్నారు.



# ఆయుర్వేద వైద్యంతో దీర్ఘకాలిక వ్యాధులు నయం



రాయపర్తి, ఆగస్టు 17,(జర్నలిస్ట్ వార్త): ఆయుర్వేద వైద్యంతో దీర్ఘకాలిక వ్యాధులు నయమౌతాయని ఆయుర్వేద జిల్లా ఇంచార్జీ డా: మైధం రాజు, ఆయుర్వేద డాక్టర్ ఉషారాణి అన్నారు. నేషనల్ ఆయుష్ మిషన్ లో భాగంగా ఆయుష్ డిప్యూటీ డైరెక్టర్ డా: ప్రమీల దేవి ఆదేశానుసారం శనివారం మండల కేంద్రంలోని ఆడ్ బడి సెంటర్ లో ఆయుష్ వృదాప్య వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వృద్దాప్యంలో సాధారణంగా వచ్చే అనారోగ్య సమస్యలను ఆయుష్ వైద్య విధానాల ద్వారా సులువైన చికిత్స అందించడం జరుగుతుందని అన్నారు. సుమారు 114 మంది వృద్దులకు పరీక్షలు నిర్వహించి, మందులు అందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి వనజ, డాక్టర్ రవి, డిపిఎం జి రాజు, ఫార్మసిస్ట్ కిరణ్, శ్రీ లక్ష్మి,తదితరులు పాల్గొన్నారు.

# రైతులకు మళ్లీ మొదలైన యూరియా తిప్పలు

**- పి.ఏ.సి.ఎస్ ముందు బారులు తీరిన రైతులు**

**- తిండీ తిప్పలు లేకుండా ఎరువుల కోసం పడిగాపులు**



రాయపర్తి, ఆగస్టు 17,(జర్నలిస్ట్ వార్త): వరంగల్ జిల్లా రాయపర్తి మండలంలోని రైతులకు మళ్ళీ యూరియా కొరత మొదలైంది. వ్యవసాయ శాఖ కార్యాలయం, ఎరువుల దుకాణాల వద్ద గంటల తరబడి అన్నదాతలు తిండీ తిప్పలు లేకుండా పడిగాపులు కాస్తున్నారు. మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో యూరియా కోసం రైతులు శనివారం ఉదయం ఆరు గంటల నుంచి క్యూ లైన్ లో నిలబడి ఉన్నారు. గంటల తరబడి వేచి ఉన్న తమకు యూరియా లభించడం లేదని రైతులు వాపోతున్నారు. అవసరానికి యూరియా లభించడం లేదని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒక్కో రైతుకు కేవలం 5 బస్తాల యూరియా మాత్రమే ఇస్తున్నారని అంటున్నారు. ఇదే అదునుగా భావించిన కొంత మంది ఫర్టిలైజర్ వ్యాపారులు అందినకాడికి దండుకుంటున్నారనీ, యూరియా కోసం వెళ్తే అనవసరమైన మందులను అంట గడుతున్నారని చెబుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి రైతులకు సకాలంలో అవసరమైన మేర ఎరువులు అందించేలా రైతులు కోరుతున్నారు.

# రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ రాజశేఖర్

**- పరామర్శించిన డీసీసీబి ఛైర్మెన్ మార్నేని**

**ఐనవోలు, ఆగస్టు 17,(జర్నలిస్ట్ వార్త):** ఐనవోలు మండలం నందనం గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు బుర్ర రాజశేఖర్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. ఆసుపత్రికి వెళ్లి, చికిత్స పొంది, విశ్రాంతి తీసుకుంటున్నారు. శనివారం సమాచారం తెలుసుకున్న తెలంగాణ రాష్ట్ర కో- ఆపరేటివ్ అపెక్స్ బ్యాంక్ చైర్మన్ మార్నేని రవీందర్ రావు వారిని పరామర్శించారు. అనంతరం ప్రమాదానికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. ప్రమాదవశాత్తూ జరిగిన రోడ్డు ప్రమాదంలో నుంచి బయటపడిన వారికి కాంగ్రెస్ పార్టీ అండ ఉండగా ఏ చింతన లేదని మనోధైర్యం కల్పించారు. వారి వెంట స్థానిక నేతలు, సొసైటీ డైరెక్టర్లు, పలువురు నాయకులు, కార్యకర్తలు తదితరులు ఉన్నారు.



# బాధిత కుటుంబానికి 10 వేల ఆర్థిక సహాయం



రాయపర్తి, ఆగస్టు 17,(జర్నలిస్ట్ వార్త): వరంగల్ జిల్లా రాయపర్తి మండలంలోని గన్నారం గ్రామానికి చెందిన పల్ల లక్ష్మారెడ్డి శనివారం అనారోగ్యంతో మృతి చెందారు. స్థానికుల కథనం ప్రకారం లక్ష్మారెడ్డి గ్రామపంచాయతీ కార్యాలయంలో మల్టీపర్పస్ వర్కర్ గా విధులు నిర్వహించే వారని చెబుతున్నారు. సమాచారం తెలుసుకున్న గ్రామపంచాయతీ కార్యదర్శి కరుణ శ్రీ మృత దేహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం బాధిత కుటుంబానికి 10 వేల రూపాయల ఆర్థిక సహాయం అందజేసి, వారు అండగా నిలిచారు. ఈ పరామర్శలో మాజీ సర్పంచ్ కుక్కల భాస్కర్, కారోబార్ నరహరి, సోమ నర్సయ్య, మేడ నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

# బాధిత కుటుంబానికి 4వేల రూపాయల ఆర్థిక సహాయం



వర్ధన్నపేట, ఆగస్టు 17,(జర్నలిస్ట్ వార్త): వర్ధన్నపేట మండలం కొత్తపల్లి గ్రామంలో బూర్గు మొగిలి శనివారం మృతి చెందారు. సమాచారం తెలుసుకున్న పి.ఏ.సి.ఎస్ ఛైర్మన్ రాజేష్ ఖన్నా హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకున్నారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి, 4 వేల ఆర్థిక సహాయం అందజేశారు. వారి వెంట ఆలయ ఛైర్మన్ కమ్మగోని సుధాకర్ గౌడ్, గౌడ సంఘం సభ్యులు తాల్లపెల్లి యాదగిరి, కృష్ణ చారి, రాజబాబు, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ భూమినీ కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకుంటా

**- అనంతగిరి తహశీల్దార్**






అనంతగిరి ఆగస్టు 17,(జర్నలిస్ట్ వార్త): అనంతగిరి మండలం ఖానాపురం గ్రామ రెవెన్యూ పరిధిలోని గల ప్రభుత్వ భూమిని కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్నారని అనంతగిరి తహసిల్దార్ హిమబిందు అన్నారు. శనివారం ఎమ్మార్వో హిమబిందు విలేకరులతో మాట్లాడుతూ ఖానాపురం గ్రామ రెవిన్యూ పరిధిలో ఉన్న సర్వే నంబర్ 778 లో సుమారు 6 ఎకరాల ప్రభుత్వ భూమిని గత ప్రభుత్వం క్రీడా ప్రాంగణం మెగా ప్రకృతితో వనంకు కేటాయించిందన్నారు. ఈ ప్రకృతి వనంలో సుమారు 2000 మొక్కలు నాటారని వారు గుర్తు చేశారు. ఈ ప్రభుత్వ భూమిపై అక్రమార్కులు కన్నేసి కబ్జా చేసి పొలం దున్ని నాటు వేసారని, చెప్పారు. తక్షణమే విచారణ చేసి చర్యలు తీసుకుంటామని తెలిపారు ఎమ్మార్వో హిమబిందు సర్వేనెంబర్ 778 వద్దకు సంబంధిత అధికారులతో కలిసి విచారణకు వెళ్లి పరిశీలించారు. తక్షణమే 6 ఎకరాలకు ఫెన్సింగ్ వేయాలని ఆదేశాలు జారీ చేశారు. కొంతమేర నాటు వేసిన పొలాన్ని పరిశీలించి, ఈ భూమి ప్రభుత్వ పరిధిలో ఉందని తక్షణమే వేసిన నారును తీసివేయాలని సంబంధిత రైతులకు సూచించారు. ప్రభుత్వ భూమిని అన్యాక్రాంతం చేసేందుకు ప్రయత్నిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# ఆన్‌లైన్ ట్రేడింగ్ పేరిట రూ.5.4 కోట్ల మోసం

**బాధితుడి ఫిర్యాదుతో ఇద్దరిని అరెస్టు చేసిన సీఎస్‌బీ**

హైదరాబాద్, ఆగస్టు 17,(జర్నలిస్ట్ వార్త):

ఆన్‌లైన్ ట్రేడింగ్‌లో పెట్టుబడులు పెడితే మంచి లాభాలు వస్తాయని నమ్మించిన సైబర్ నేరగాళ్లు ఏకంగా రూ.5.4 కోట్లు కొట్టేశారు. హైదరాబాద్ చిక్కడపల్లిలో నివసించే వ్యక్తి ట్రేడింగ్ నిర్వహిస్తుంటాడు. అయితే జూన్ 8న తన వాట్సాపకు వచ్చి న ఆన్‌లైన్ పెట్టుబడుల లింక్ ఓపెన్ చేసి గ్రూపులో చేరాడు. 'బీ6/స్టాక్ విజనరీస్' పేరుతో ఉన్న గ్రూప్‌లో లైదియ శర్మ అనే మహిళ గోల్డ్‌మెన్ స్కీం గురించి అతడికి వివరించింది. పెట్టుబడులు పెట్టి లాభాలు ఆర్జించాలంటే రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించింది. పాన్‌కార్డు, ఆధార్ కార్డుతోపాటు ఇతర వివరాలతో ఆమె చెప్పిన వెబ్‌సైట్‌లో లాగిన్ అయ్యి ట్రేడింగ్ మొదలుపెట్టాడు. జూలై 10న మొదటగా రూ.30 వేలు పెట్టుబడి పెట్టగా మంచి లాభాలు వచ్చాయి. అయితే కేరళలో తాను నిర్వహిస్తున్న స్వచ్ఛంద సంస్థకు రూ. 8.5 కోట్లు అప్పు ఉందని అతడు చెప్పడంతో.. లైదియా ట్రేడింగ్‌తో మంచి లాభాలు వస్తాయని, అప్పు సులువుగా తీర్చవచ్చని నమ్మించింది. దీంతో అతడు నెల రోజుల్లో పలు దఫాలుగా రూ. 5.4 కోట్లు పెట్టుబడిగా పెట్టాడు. వెబ్‌సైట్‌లో బాధితుడికి రూ.15.58 కోట్లు లాభం వచ్చినట్లు చూపిస్తున్నా.. విత్‌డ్రా చేసుకునేందుకు ప్రయత్నించగా ఫలితం లేకుండా పోయింది. దీంతో వారిని సంప్రదించగా.. విత్‌డ్రా చేసుకోవాలంటే మరికొంత చెల్లించాలని డిమాండ్ చేశారు. మోసపోయానని గుర్తించిన అతడు.. సైబర్ క్రైం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తు చేపట్టిన పోలీసులు.. ఏపీలోని విజయవాడలో రాంపల్లి కొండల్ రావు, అతని సోదరుడు చంద్రశేఖర్ ఆజాద్‌ను అరెస్ట్ చేశారు.

# ప్రధాని మోదీతో సీఎం చంద్రబాబు సమావేశం

**ఢిల్లీలో పర్యటిస్తున్న ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు**

**మోదీ-చంద్రబాబు భేటీ 15 నిమిషాలు ఆలస్యం**

**కేంద్ర బడ్జెట్ ప్రకటన తర్వాత మోదీని తొలిసారి కలిసిన చంద్రబాబు**

అమరావతి ఆగస్టు 17,(జర్నలిస్ట్ వార్త): ఏపీ సీఎం చంద్రబాబు ఈ సాయంత్రం దేశ రాజధాని ఢిల్లీలో ప్రధాని నరేంద్ర మోదీతో భేటీ అయ్యారు. కేంద్ర బడ్జెట్ ప్రకటించాక... మోదీతో చంద్రబాబు సమావేశం కావడం ఇదే ప్రథమం. వాస్తవానికి చంద్రబాబుకు ప్రధానితో అపాయింట్‌మెంట్ సాయంత్రం 4.30 గంటలకు కాగా... 15 నిమిషాలు ఆలస్యంగా సమావేశం ప్రారంభమైంది. ప్రధాని మోదీ ఇతర సమావేశాల్లో పాల్గొన్న కారణంగా చంద్రబాబుతో భేటీ షెడ్యూల్ మారింది. ఇటీవల బడ్జెట్ లో ఏపీకి సంబంధించి కేంద్రం పలు కీలక ప్రకటనలు చేసింది. అమరావతికి రూ.15 వేల కోట్లతో పాటు, పోలవరం ప్రాజెక్టుకు అయ్యే మొత్తం ఖర్చు భరిస్తామని స్పష్టం చేసింది. ఈ అంశాలపై నేడు ప్రధాని మోదీతో సమావేశంలో చంద్రబాబు చర్చించనున్నారు. మోదీతో సమావేశం అనంతరం చంద్రబాబు... కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, కేంద్ర హెూంమంత్రి అమిత్ షాలతో సమావేశం కానున్నారు.



# చైనా బీఆర్ఐ ప్రమాదకరం


## గ్లోబల్ సౌత్ సదస్సులో మోదీ



న్యూఢిల్లీ, ఆగస్టు 17,(జర్నలిస్ట్ వార్త): ఉగ్రవాదం, తీవ్రవాదం, వేర్పాటువాదం అతిపెద్ద ముప్పుగా పరిణమించాయని, వీటి నుంచి మన సమాజాలను కాపాడుకోవాల్సిన అవసరం ఉందని ప్రధాని మోదీ నొక్కి చెప్పారు. శనివారం జరిగిన 'గ్లోబల్ సౌత్ దేశాల గళం' సదస్సులో వర్చువల్‌గా ఆయన ప్రసంగించారు. గ్లోబల్ సౌత్ దేశాలకు పరస్పర వాణిజ్యం, సమ్మిళిత వృద్ధి, సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సాధనలో భారత్ సహకరిస్తుందని తెలిపారు. ఆయా దేశాలు ఐక్యంగా ఉండడం ద్వారా ఆరోగ్య, ఆహార, ఇంధన భద్రత విషయంలో తలెత్తుతున్న సవాళ్లను అధిగమించేందుకు అవకాశం ఉంటుందన్నారు. అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థల్లో భారతదేశ డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్(డీపీఐ) వినియోగాన్ని వేగవంతం చేసేందుకు ఏర్పాటు చేసిన సామాజిక ప్రభావ నిధికి ప్రాథమికంగా 25 మిలియన్ డాలర్ల(దాదాపు రూ.200 కోట్లు) సహకారాన్ని ప్రకటించారు. ఇతర దేశాలతో అభివృద్ధి భాగస్వామ్యం పంచుకునేందుకు భారత్ దేశ సొంత అభివృద్ధి, అనుభవాల ఆధారంగా గ్లోబల్ డెవలప్‌మెంట్ కంపాక్ట్(జీడీసీ)ను ప్రధాని ప్రతిపాదించారు. ఇది గ్లోబల్ సౌత్ దేశాలు ప్రతిపాదించిన అభివృద్ధి ప్రాధాన్యాలపైనా దృష్టి పెడుతుందన్నారు. అభివృద్ధి పేరుతో అప్పులు చేస్తున్న దేశాలకు కూడా గ్లోబల్ డెవలప్‌మెంట్ కంపాక్ట్ ఎలాంటి భారం మోపదని తెలిపారు. భాగస్వామ్య దేశాలకు సుస్థిరాభివృద్ధిలో సహకారం అందిస్తుందన్నారు. చైనా ప్రతిపాదిత బెల్ట్ అండ్ రోడ్ ఇనిషియేటివ్(బీఆర్ఐ)ని ప్రధాని మోదీ తీవ్రంగా విమర్శించారు. దీనివల్ల నిలకడలేని ప్రాజెక్టులకు వేల కోట్ల రూపాయల రుణాలు ఇవ్వడం ద్వారా ఆసియా, ఆఫ్రికా దేశాలను అప్పుల ఊబిలో కూరుకుపోయేలా చేస్తోందని అన్నారు. బీఆర్ఐకి ప్రత్యామ్నాయంగా గ్లోబల్ డెవలప్‌మెంట్ కంపాక్ట్‌ను అందిపుచ్చుకోవాలన్నారు. దీనివల్ల వాణిజ్యం వృద్ధి చెందుతుందని, సుస్థిరాభివృద్ధిలో సామర్థ నిర్మాణం పెరుగుతుందని, సాంకేతికతను ఇచ్చిపుచ్చుకోవచ్చని, ప్రాజెక్టుల కోసం రాయితీ రుణాలు, గ్రాంట్లను పొందే అవకాశం ఉంటుందని వివరించారు. వాణిజ్య కార్యకలాపాలను బలోపేతం చేసేందుకు రూ.21కోట్ల (2.5 మిలియన్ డాలర్లు)తో ప్రత్యేక నిధి ప్రారంభిస్తున్నట్టు చెప్పారు. అదేవిధంగా వాణిజ్య విధానాలపై శిక్షణకు రూ.8 కోట్ల(1 మిలియన్ డాలర్లు)తో మరోనిధిని ఏర్పాటు చేస్తున్నామన్నారు. గ్లోబల్ సౌత్ దేశాలకు చౌక ధరలకే సమర్థవంతమైన జనరిక్ ఔషధాలను అందుబాటులో ఉంచుతామని ప్రధాని మోదీ తెలిపారు. 'ఆరోగ్య మైత్రి' కింద ఆఫ్రికా, పసిఫిక్ ఐలాండ్ దేశాలకు డయాలిసిస్ మిషన్లను, ప్రాణాధారిత ఔషధాలను అందించామని, అదేవిధంగా ఆసుపత్రులు, జన్ ఔషధి కేంద్రాలను ఏర్పాటు చేశామని వివరించారు. గ్లోబల్ సౌత్ దేశాల్లో తలెత్తిన ఉద్రిక్తతలు, సంఘర్షణలపై ప్రధాని ఆందోళన వ్యక్తం చేశారు. 'ఇది చాలా తీవ్రమైన విషయం' అని వ్యాఖ్యానించారు. సవాళ్లను అధిగమించేందుకు గ్లోబల్ సౌత్ దేశాలు ఐక్యంగా ఉండాలన్నారు."మనం ఇప్పటికే అనేక సవాళ్లను ఎదుర్కొంటున్నాం. వాతావరణ మార్పులు, ఉగ్రవాదం, తీవ్రవాదం, వేర్పాటు వాదాలు మన సమాజాలకు తీవ్ర సవాళ్లుగా పరిణమించాయి" అని ప్రధాని మోదీ తెలిపారు. సాంకేతికత కారణంగా తలెత్తుతున్న సామాజిక సవాళ్లు పుట్టుకొస్తున్నాయన్నారు. గత శాతాబ్దపు పాలన, సంస్థలు ఈ శతాబ్దపు సవాళ్లతో పొరాడలేక పోతున్నాయని తెలిపారు. 2022లో జీ-20 సదస్సుకు నేతృత్వం వహించిన భారత్.. గ్లోబల్ సౌత్ గళాన్ని వినిపించే వేదికను సృష్టించిందన్నారు.

# కోల్‌కతా ఘటనపై దేశవ్యాప్తంగా వైద్యుల ఆందోళన

**విధులు బహిష్కరించి నిరసనలు..ధర్నాలు  కేవలం ఎమర్జెన్సీ కేసులు మాత్రమే హాజరు**



న్యూఢిల్లీ, ఆగస్టు 17,(జర్నలిస్ట్ వార్త):

కోల్‌కతాలో జూనియర్ డాక్టర్‌పై హత్యాచారం ఘటన దేశ వ్యాప్తంగా కాకరేపుతోంది. కోల్‌కతాలో జరిగిన ఘటనపై దేశంలో వైద్యులంతా ఏకతాటిపైకి వచ్చారు. గతంలో ఏవైనా ఘటనలు జరిగేటప్పుడు స్వరాష్ట్రంలో మాత్రమే నిరసనలు జరిగేవి. తీవ్రత ఆధారంగా దేశ వ్యాప్తంగా నిరసన గళం వినిపించేది. ప్రస్తుతం కోల్‌కతా ఘటనపై ప్రతి ఒక్కరూ న్యాయం కోసం నినదిస్తున్నారు. దేశంలో వైద్యులంతా ఐక్యమై రోడ్డెక్కారు. ముందు తమ ప్రాణాలకు రక్షణ కల్పిస్తే.. తాము రోగుల ప్రాణాలు కాపాడతామంటూ వైద్యులు నినదిస్తున్నారు. మరోవైపు పార్టీలకు అతీతంగా అన్ని రాజకీయ పక్షాలు వైద్య విద్యార్థినికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తున్నాయి. ఓవైపు సీబీఐ విచారణ కొనసాగుతుండగా.. త్వరగా విచారణ పూర్తిచేసి..నిందితులను కఠినంగా శిక్షించాలంటూ పశ్చిమబెంగాల్ సీఎం మమతా బెనర్జీ సైతం నిరసనల్లో పాల్గొన్నారు. మమతా బెనర్జీ రాజీనామా చేయాలని పశ్చిమబెంగాల్ బీజేపీ నేతలు డిమాండ్ చేస్తున్నారు. మరోవైపు ఈ ఘటనలో నిందితులందరిని తక్షణమే అరెస్ట్ చేయాలనే డిమాండ్ వినిపిస్తోంది. జూనియర్ డాక్టర్‌పై హత్యాచారం కేసులో ఆసుపత్రిలోని కొందరు వైద్యులు, సిబ్బంది పాత్ర ఉందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కోల్‌కతాలో జూనియర్ డాక్టర్ ఘటనపై తెలుగు రాష్ట్రాల్లో వైద్యులు నిరసన వ్యక్తం చేస్తున్నారు. కోల్‌కతాలో జూనియర్ డాక్టర్ అత్యాచార ఘటన దేశవ్యాప్తంగా కలకలం రేపిన సంగతి తెలిసిందే. ఈ ఘటనను నిరసిస్తూ ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ), ఫ్యాకల్టీ అసోసియేషన్ ఆఫ్ ఆల్ ఇండియా ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ దేశవ్యాప్తంగా నిరసనకు పిలుపునిచ్చింది. దేశవ్యాప్తంగా శనివారం 24 గంటలపాటు వైద్య సేవల బంద్ చేయాలని నిర్ణయించాయి వైద్య సంఘాలు. అత్యవసర సేవలు మినహా అన్ని ఆరోగ్య సేవలు, సాధారణ సేవలు శస్త్రచికిత్సలు శనివారంఉదయం 6 నుండి ఆదివారం ఉదయం 6 గంటల వరకు నిలిపివేస్తున్నట్లు తెలిపింది. డాక్టర్లు కేవలం ఎమర్జెన్సీ కేసులను మాత్రమే అటెండ్ అవ్వాలని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ వెల్లడించింది.










# ప్రభాస్‌తో హను రాఘవపూడి మూవీ పూజాకార్యక్రమాలతో ప్రారంభం

వరుస విజయాలతో జోష్ మీదున్న ప్రభాస్ తర్వాత సినిమాను ప్రారంభించారు. హను రాఘవపూడి దర్శకత్వంలో ఆయన హీరోగా రానున్న సినిమా మొదలైంది. నేడు పూజా కార్యక్రమాలతో దీన్ని ప్రారంభించారు. ఈ విషయాన్ని తెలుపుతూ నిర్మాణ సంస్థ మైత్రీ మూవీస్ ఓ పోస్ట్ పెట్టింది. ప్రస్తుతం దీనికి సంబంధించిన ఫొటోలను అభిమానులు షేర్ చేస్తున్నారు. ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించిన మరిన్ని వివరాలను ప్రకటించనున్నారు. పూర్తిస్థాయి పీరియాడిక్ యాక్షన్ డ్రామాగా ఇది రానుంది. ఇప్పటికే విశాల్ చంద్రశేఖర్ ఈ చిత్రం కోసం మూడు పాటలు కూడా కంపోజ్ చేసినట్లు హను రాఘవపూడి ఓ సందర్భంలో తెలిపారు. పాన్ ఇండియా స్థాయిలో ఇది తెరకెక్కనుంది. తాజాగా దీనికి సంబంధించిన టైటిల్ కూడా సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఈ చిత్రానికి 'ఫౌజీ' అనే పేరును పరిశీలిస్తున్నట్లు వార్తలు వస్తున్నాయి. ఇక ఈ చిత్రంలో హీరోయిన్‌గా మృణాల్‌ను తీసుకుంటున్నట్లు వచ్చిన రూమర్స్‌ను ఆమె ఇటీవలే ఖండించారు. 'మీ ఊహాగానాలకు ఫుల్‌స్టాప్ పెడుతున్నందుకు క్షమించండి. నేను ఈ ప్రాజెక్ట్‌లో లేను' అని పేర్కొన్నారు. దీంతో రూమర్‌కు చెక్ పడింది. మరి ఇందులో ప్రభాస్ సరసన ఎవరు కనిపిస్తారో అని ఆయన అభిమానులు ఆశగా ఎదురుచూస్తున్నారు.






# మాస్ హీరోగా కనిపించడమే ఇష్టం అంటున్న నాని

పక్కింటి కుర్రాడిలా కనిపించే నాని అష్టా చమ్మా చిత్రంతో హీరోగా పరిచయమయ్యాడు. ఆ తరువాత, ఈగ చిత్రంతో ఏకంగా దర్శకధీరుడు రాజమౌళి చిత్రంలో నటించే ఛాన్స్‌ను కొట్టేశాడు. ఆ తరువాత నానికి వెనుతిరిగి చూసుకోవాల్సిన అవసరం లేదు. ఎవడే సుబ్రమణ్యం, భీమిలి కబడ్డి జట్టు, అలా మొదలైంది, పిల్లా జమీందార్, భలే భలే మగాడివోయ్,జెర్సీ, నేనులోకల్, ఎమ్‌సీఎ, నిన్నుకోరి, శ్యామ్ సింగరాయ్, దసరా వంటి విజయాలను తన ఖాతాలో వేసుకున్నాడు.ఆయన ప్రస్తుతం వివేక్ ఆత్రేయ దర్శకత్వంలో సరిపోదా శనివారం చిత్రంలో నటిస్తున్నాడు.. ఈ నెలలోనే ఆ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. అయితే నేచురల్‌స్టార్‌గా పక్కింటి కుర్రాడిగా కనిపించే నానికి లవ్‌స్టోరీస్, ఫ్యామిలీఎంటర్‌టైనర్ చిత్రాలే ఇప్పటి వరకు హిట్స్‌ను తీసుకొచ్చాయి. అయితే నానికి మాత్రం తను మాస్ హీరోగా మాస్ ఎంటర్‌టైనర్ సినిమాలు చేయాలని కోరిక. అందుకే ఆ తరహా సినిమాలు వీ, దసరా, శ్యామ్ సింగరాయ్ చిత్రాలను చేసి తన కోరిక తీర్చుకున్నాడు. అయితే ఆ చిత్రాలు నానికి అంతగా సంతృప్తి నివ్వలేదు. అందుకే సరిపోదా శనివారం తరువాత వరుసగా మూడు మాస్ సినిమాల్లో నాని కనిపించబోతున్నాడు. ప్రస్తుతం హిట్ 2 చిత్రంలో అర్జున్ సర్కార్‌గా కనిపిస్తున్న నాని త్వరలో మరో రెండు చిత్రాల్లో మాస్ అవతార్‌లో కనిపించబోతున్నాడు. దసరా దర్శకుడు శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో ఓ మాస్ కమర్షియల్ ఎంటర్‌టైనర్‌లో నటిస్తున్న నాని ఆ తరువాత సుజిత్ దర్శకత్వంలో ఓ సినిమా చేయడానికి అంగీకరించాడు. ప్రస్తుతం సుజిత్ పవన్‌కళ్యాన్‌తో ఓజీ అనే చిత్రాన్ని తెరకెక్కిస్తున్నాడు. ఈ సినిమా తరువాత నానితో చేయబోయే సినిమా వుంటుంది. అయితే ఈ చిత్రంలో నాని ఫెరోషియాస్, యాంగ్రిమెన్‌గా ఫుల్ మాస్ హీరోగా కనిపించబోతున్నాడట. ఈ విషయాన్ని నానినే ఇటీవల ఓ ఇంటర్వ్యూలో తెలియజేశాడు. అంతేకాదు తనను ఇలా ఓ మాస్ హీరోగా చూడాలన్న తన అభిమానుల కోరిక కూడా ఈ సినిమాతో తీరబోతుందని అంటున్నాడు నాని.

# బర్త్ డే బ్యూటీ నిధి డబుల్ ధమాకా




తనదైన అందం, నటప్రతిభతో యువతరాన్ని ఆకట్టుకుంది నిధి అగర్వాల్. కానీ కొన్ని పరాజయాలు ఇబ్బంది పెట్టాయి. ప్రస్తుతం కెరీర్ కీలక దశలో మంచి విజయం కోసం వేచి చూస్తోంది. బ్యాక్ టు బ్యాక్ టాలీవుడ్ అగ్ర హీరోల సినిమాల్లో అవకాశాలు అందుకోవడం తనకు ప్లస్ గా మారనుందని ఆశిస్తోంది. పవర్ స్టార్ పవన్ కల్యాణ్ నటిస్తున్న పాన్ ఇండియన్ మూవీ 'హరి హర వీరమల్లు'లో అవకాశం అందుకున్న ఈ బ్యూటీ .. అదే సమయంలో ప్రభాస్ లాంటి పాన్ ఇండియా స్టార్ నటిస్తున్న 'రాజా సాబ్'లో ఛాన్స్ దక్కించుకుంది. ఈ రెండు సినిమాలు తన కెరీర్‌ను మలుపు తిప్పుతాయని ఆశిస్తోంది. నిధి బర్త్ డే కానుకగా 'హరిహర వీరమల్లు' నుంచి కొత్త లుక్ ని రిలీజైన సంగతి తెలిసిందే. నిధి రాకుమారిలా కనిపిస్తున్న క్లాసిక్ పోస్టర్ అభిమానుల్లోకి వైరల్ గా దూసుకెళ్లింది. తాజాగా 'రాజా సాబ్' సెట్స్ లో నిధి బర్త్ డే వేడుకలకు సంబంధించిన ఫోటోలను సోషల్ మీడియాల్లో షేర్ చేసింది. ఈ ఫోటోల్లో రాజా సాబ్ దర్శకుడు మారుతి, ఇతర చిత్రబృందంతో నిధి ఎంతో ఆనందంగా కనిపిస్తోంది. 2024 తనకు బెస్ట్ ఫేజ్ నిస్తుందని ఈ బ్యూటీ భావిస్తోంది.ఆశలన్నీ ఆ రెండిటిపైనే: 'మున్నా మైఖేల్' చిత్రంతో బాలీవుడ్‌లో అడుగుపెట్టిన నిధి అగర్వాల్ తెలుగులో నాగచైతన్య, అఖిల్ లాంటి స్టార్ల సరసన కెరీర్‌ని ప్రారంభించింది. కానీ ఇవేవీ ఆశించిన ఫలితాన్ని ఇవ్వేలేదు. ఎనర్జిటిక్ స్టార్ రామ్ సరసన ఇస్మార్ట్ శంకర్ తో బ్లాక్ బస్టర్ అందుకున్నా ఆ తర్వాత వచ్చిన సినిమాలు మిశ్రమ ఫలితాలను అందించాయి. జయం రవి లాంటి హీరోల సరసన కోలీవుడ్‌లోను నటించింది. కానీ అక్కడా ఆశించిన ఫలితం రాలేదు. కొంతకాలంగా పవన్ కళ్యాణ్ సరసన 'హరిహర వీరమల్లు' సినిమాతో నిధి బిజీగా ఉంది. ఇదే సమయంలో ప్రభాస్ సరసన రాజా సాబ్‌లో అవకాశం రావడంతో నిధి ఆనందానికి అవధుల్లేవ్. ఈ చిత్రానికి మారుతి దర్శకత్వం వహిస్తున్న సంగతి తెలిసిందే. కొంత గ్యాప్ తర్వాత నిధి కెరీర్‌లో చెప్పుకోదగ్గ పెద్ద సినిమాలివి. ఈ రెండు సినిమాలపైనా నిధి పెద్ద హోప్స్ పెట్టుకుంది. బర్త్ డే బ్యూటీ వరుసగా రెండు పాన్ ఇండియన్ సినిమాల్లో నటిస్తోంది. ఈ రెండు సినిమాలు తనకు విజయాల్ని అందిస్తాయని అభిమానులు ఆకాంక్షిస్తున్నారు. అందాల నిధికి బర్త్ డే సందర్భంగా ప్రత్యేక శుభాకాంక్షలు.




# మెల్‌బోర్న్ ఫిలిం ఫెస్టివల్‌కు రామ్‌చరణ్

## 14 ఏళ్ల తరవాత రావడం ఆనందంగా ఉందని వ్యాఖ్య





ఆస్ట్రేలియాలోని మెల్‌బోర్న్ వేదికగా జరుగుతోన్న 'ది ఇండియన్ ఫిల్మ్ ఫెస్టివల్ ఆఫ్ మెల్‌బోర్న్'కు గౌరవ అతిథిగా రామ్‌చరణ్ హాజరయ్యారు. భారతీయ చలనచిత్ర పరిశ్రమకు చేసిన సేవలకుగాను 'ఆర్ట్ అండ్ కల్చర్ బ్రాండ్ అంబాసిడర్'గా అంతర్జాతీయ వేదికపై అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 'ఆరెంజ్' రోజులను గుర్తుచేసుకున్నారు. 14 ఏళ్ల క్రితం 'ఆరెంజ్' సినిమా కోసం ఆస్ట్రేలియాలోని ఈ ప్రదేశానికి వచ్చాను. అది నా మూడో చిత్రం. 30 రోజులు చిత్రీకరణ ఇక్కడే జరిగింది. షూటింగ్ పూర్తయి భారత్‌కు వెళ్లే సమయంలో భావోద్వేగానికి గురయ్యాను. ఇక్కడి ప్రజల ప్రేమను, ఆ రోజులను ఎప్పటికీ మర్చిపోలేను. అప్పటి కంటే ఇప్పుడు ఎక్కువ మంది ఇండియన్స్ ఇక్కడ కనిపిస్తున్నారు. నా హోం టౌన్‌కు వచ్చినట్లు అనిపిస్తోంది. మీ అందరినీ చూస్తుంటే ఆనందంగా ఉంది. భారతీయ చిత్రపరిశ్రమ అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చుకోవడం సంతోషంగా ఉంది. మీ అందరి వల్లే ఇది సాధ్యమైంది. ఈ ఈవెంట్ ఎప్పటికీ ప్రత్యేకమే' అని చెప్పారు. ఆస్ట్రేలియాలో మన జాతీయ జెండాను ఎగురవేసిన రామ్ చరణ్.. అక్కడ అభిమానులతో కలిసి ఫొటోలు దిగారు. వాళ్లతో కలిసి సరదాగా సమయాన్ని గడిపారు. ప్రస్తుతం ఈ హీరో 'గేమ్ ఛేంజర్' తో బిజీగా ఉన్నారు. శంకర్ దర్శకత్వంలో ఇది రానుంది. పొలిటికల్, యాక్షన్ నేపథ్యంలో సాగే పవర్‌ఫుల్ కథాంశంతో సిద్ధమవుతోంది. ఇందులో రామ్ చరణ్ ద్విపాత్రాభినయంలో కనిపించనున్నట్లు సమాచారం. డిసెంబర్‌లో ఇది ప్రేక్షకుల ముందుకు రానుంది.

# థియేటర్లకు రాకుండా చేస్తున్నాం

## దిల్‌రాజు ఆసక్తికర వ్యాఖ్యలు



ప్రేక్షకులు థియేటర్స్‌కు రాకుండా మేమే చెడగొట్టామని ప్రముఖ నిర్మాత దిల్‌రాజు అన్నారు. నాలుగు వారాలకే సినిమాను ఓటీటీలోకి తీసుకురావడం వల్ల ఈ పరిస్థితి తలెత్తిందని వ్యాఖ్యానించారు. ఎప్పటి కప్పుడు పరిశ్రమలోని పరిస్థితులను అంచనా వేస్తూ, అందుకు తగినట్లు సినిమాలు నిర్మించే వారిలో దిల్‌రాజు ఒకరు. తాజాగా ఓటీటీలపై ఆయన చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం ఇండస్ట్రీలో హాట్‌టాపిక్ అయ్యాయి. 'రేవు' ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో పాల్గొన్న ఆయన మాట్లాడారు. కొత్తవాళ్లతో సినిమాలు తీసే పక్రియ ఇండస్ట్రీలో ఎప్పుడూ జరుగుతూనే ఉంటుంది. కానీ, 99శాతం ఫెయిల్ అవుతాయి. ఒకశాతం మాత్రమే సక్సెస్ రేట్. కెరీర్ తొలినాళ్లలో నేను సినిమాలు తీసేటప్పుడు నా సినిమాకు ఆడియన్స్ ఎలా వస్తారు? ఇంకా ఏమేం యాడ్ చేయాలి? అనుకుంటూ తీసేవాడిని. సినిమా తీయడం ఈ రోజుల్లో గొప్ప కాదు. ప్రేక్షకుడు థియేటర్‌కు వచ్చి ఆ మూవీని చూడటమే బిగ్ ఛాలెంజ్. మేము తీసిన 'బలగం', 'కమిటీ కుర్రోళ్ళు' నెమ్మదిగా మౌత్ టాక్ ద్వారా ప్రేక్షకులకు చేరాయి. అదే సమయంలో సినిమా బాగుందని రివ్యూలు ఇవ్వడం కూడా ప్రేక్షకుల్లో ఆసక్తిని పెంచాయి. అసలు ప్రేక్షకులను చెడగొట్టింది మేమేలెండీ.. 'మీరు ఇంట్లో కూర్చోండి. నాలుగు వారాల్లో ఓటీటీకి తెస్తాం' అని థియేటర్‌కు రాకుండా చేసుకున్నాం. ఈ సినిమా (రేవు) చూసి నేను కూడా రివ్యూ ఇస్తా (నవ్వులు). మంచి సినిమా.. అదీ చిన్న మూవీ అయితే, ఇండస్ట్రీలోని ప్రతి ఒక్కరూ సహకారం అందించాలి' అని దిల్‌రాజు అన్నారు. ప్రస్తుతం దిల్‌రాజు వ్యాఖ్యలపై అటు ఇండస్ట్రీతో పాటు, ఇటు సామాజిక మాధ్యమాల వేదికగానూ చర్చ జరుగుతోంది. కరోనా తర్వాత వందల చిత్రాలు బాక్సాఫీస్ వద్ద సందడి చేశాయి. థియేట్రికల్ రన్ బాగున్న సినిమాలు కూడా ముందుగానే స్ట్రీమింగ్‌కు వచ్చేశాయి. సినిమా విడుదలకు ముందే ఓటీటీ సంస్థలతో చిత్ర బృందాలు చేసుకున్న ఒప్పందాల కారణంగా రాక తప్పని పరిస్థితి. 'సలార్', 'టిల్లు స్క్వేర్', 'ది ఫ్యామిలీ స్టార్' వంటి చిత్రాలన్నీ జయాపజయాలతో సంబంధం లేకుండా త్వరగా ఓటీటీ బాటపట్టాయి. ఈ ఏడాది 'హనుమాన్', 'కల్కి 2898 ఏడీ'లు మాత్రం ఓటీటీలోకి వచ్చేందుకు కనీసం 50 రోజులు ఆగాయి. మరోవైపు ప్రేక్షకుడు థియేటర్‌కు వచ్చి సినిమా చూసే పరిస్థితులు నానాటికీ తగ్గిపోతున్నాయి. ఇందుకు చాలా కారణాలు ఉన్నాయి. టికెట్ ధరలు, పార్కింగ్ వసూళ్లు, తినుబండారాల ధరలు వెరసి నలుగురున్న కుటుంబ సినిమా చూడాలంటే తక్కువలో తక్కువ రూ.2వేలు ఖర్చు చేయాల్సిందే. వీటిని నియంత్రిస్తే, ప్రేక్షకుడు కచ్చితంగా థియేటర్‌కు వస్తాడన్నది సామాన్యుడి మాట. కనీసం 50రోజులు పూర్తయిన తర్వాతే ఓటీటీలో వచ్చేలా ఒప్పందం చేసకుంటున్నాయి. తాజాగా తమిళ చిత్ర నిర్మాతల మండలి కూడా కీలక నిర్ణయం తీసుకుంది. అగ్ర కథానాయకులకు సంబంధించిన ఏ సినిమా అయినా విడుదలైన తేదీ నుంచి 8 వారాల తర్వాతే ఓటీటీలో విడుదల చేయాలని నిర్ణయించింది. మలయాళంలోనూ ఇలాంటి చర్యలకు శ్రీకారం చుట్టారు.